www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 24 మార్చి 2025



ఆర్‌జియుకెటిలో ఘనంగా ఎటర్నాక్స్‌-25

నూజివీడు టౌన్‌ :ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో ఎటర్నాక్స్‌-25 వేడుకలు రెండోరోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆసక్తికరమైన ఈవెంట్లు నిర్వహించారు. కాలేజీ అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు, పరిశ్రమలతో అనుసంధానం తదితర విషయాలపై చర్చించారు. వైస్‌ ఛాన్సలర్‌ విజయ్‌కుమార్‌ మాట్లాడుతూ ఆర్‌జియుకెటి అభివృద్ధికి మీ మద్దతు ఎంతగానో అవసరమని అభిప్రాయపడ్డారు. మాజీ వైస్‌ ఛాన్సలర్‌ ప్రొఫసర్‌ ఆర్‌వి.రాజ్‌కుమార్‌ మాట్లాడుతూ ఆర్‌జియుకెటి విద్యావ్యవస్థ అనేది అన్ని ఆశావహ యువతకు, భవిష్యత్తు నాయకులకు శాశ్వత విద్య అని పేర్కొన్నారు. డైరెక్టర్‌ అమరేంద్ర కుమార్‌, ఆర్‌జియుకెటి నూజివీడు ఎఒ డాక్టర్‌ బి.లక్ష్మణరావు, ఆర్‌జియుకెటి ఒంగోలు డైరెక్టర్‌ భాస్కర్‌ పటేల్‌, ఆర్‌జియుకెటి శ్రీకాకుళం డైరెక్టర్‌ కెవిడి బాలాజీ, ఆర్‌జియుకెటి నూజివీడు ఇసిఇ హెచ్‌ఒడి, ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జి అలుమ్ని సెల్‌ శివలాల్‌, ఆర్‌జియుకెటి మొదటి బ్యాచ్‌ అలూమ్నిగా రావడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు.

జిల్లా పరిషత్‌లో.. ఏం జరుగుతోంది..!

రద్దుచేసిన అకౌంట్‌ ఆఫీసర్‌ పోస్టులో ప్రత్యేకంగా అధికారి నియామకం

జిల్లా కలెక్టర్‌, రాష్ట్ర స్థాయి అధికారుల అనుమతులు ఉన్నాయా

ఒకే అధికారికి మూడు పోస్టులు అప్పగింత వెనుక రహస్యం ఏమిటి?

జెడ్‌పి సిఇఒ సెలవు వెనుక రాజకీయ నాయకుల ఒత్తిడే కారణమా

నిబంధనలకు విరుద్ధంగా సంతకాలు పెట్టలేక సిఇఒ సెలవుపై వెళ్లారంటూ చర్చ

సెలవు దినంలో జెడ్‌పి ఆవరణలో ఏళ్లనాటి చెట్లు నరికివేతకు ప్రణాళిక

ఆర్థిక సంఘం నిధులపైనా నేతల కన్ను పడిందా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానీకానికి తలమానికంగా ఉండే జిల్లా పరిషత్‌ (జెడ్‌పి) కార్యాలయంలో జరుగుతున్న పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. అసలు జెడ్‌పి కార్యాలయంలో ఏం జరుగుతోందంటూ అందరిలోనూ చర్చ కొనసాగుతోంది. నిబంధనలను కాలరాసి నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాల విభజన జరిగినప్పటికీ జిల్లా పరిషత్‌ మాత్రం ఉమ్మడి పశ్చిమ గోదావరిగానే ఉంది. జిల్లా పరిషత్‌ పరిధిలో మొత్తం 48 మండలాలు ఉన్నాయి. దాదాపు 40 లక్షల మంది జనాభాకు సంబంధించిన నిర్ణయాలన్నీ జెడ్‌పిలో జరుగుతాయి. అలాంటి కార్యాలయం కొంతకాలంగా వివాదాలకు కేరాఫ్‌ అడ్రస్‌గా మారుతోంది. గత ప్రభుత్వం 2020లో ప్రత్యేక జిఒ తీసుకొచ్చి జిల్లా పరిషత్‌లో అకౌంట్‌ ఆఫీసర్‌ (గణాంకాధికారి) పోస్టును రద్దు చేసింది. డివిజన్ల వారీగా డిఎల్‌డిఒ (డివిజనల్‌ డవలప్‌మెంట్‌ ఆఫీసర్‌) పోస్టులను తీసుకొచ్చింది. దీంతో పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌ అకౌంట్‌ ఆఫీసర్‌ పోస్టు సైతం రద్దయ్యింది. రద్దయిన అకౌంట్‌ ఆఫీసర్‌ పోస్టులో ఇప్పుడు ప్రత్యేకంగా ఓ అధికారిని (ఎఫ్‌ఎసి) నియమించడంతోపాటు, ప్రత్యేక ఛాంబర్‌ కేటాయించడం, సదరు అధికారికి ఆఫీస్‌ సబార్డినేట్‌ (అటెండర్‌)ను సైతం కేటాయించడం చూసి అంతా నివ్వెరపోతున్నారు. రద్దయిన పోస్టులో ప్రత్యేకంగా అధికారిని ఏవిధంగా నియమిస్తారో ఏ ఒక్కరికీ అర్థం కావడం లేదు. అకౌంట్‌ ఆఫీసర్‌గా నియమించిన వ్యక్తి ఇప్పటికే రెండు పోస్టులో పనిచేస్తున్నారు. జెడ్‌పిలో ఎఒ (అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌)గాను, ద్వారకాతిరుమల ఎంపిడిఒ (ఎఫ్‌ఎసి)గా పనిచేస్తున్నారు. ఇప్పుడు సదరు అధికారిని అకౌంట్‌ ఆఫీసర్‌గా నియమించారు. రద్దయిన అకౌంట్‌ ఆఫీసర్‌ నియమాకం కొత్తగా జరగాలంటే జిల్లా కలెక్టర్‌, ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారుల అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అనుమతి తీసుకుని నియమించారా.. లేక వీరే ఇష్టానుసారంగా నియమించారో తేలాల్సి ఉంది. రద్దయిన పోస్టులకు అనుతులు ఇచ్చే అవకాశం ఉండదని చెబుతున్నారు. అకౌంట్‌ ఆఫీసర్‌ను ఏవిధంగా నియమించారో జిల్లా పరిషత్‌ అధికారులు చెప్పాల్సి ఉంటుంది. కొత్తగా అకౌంట్‌ ఆఫీసర్‌ నియామకం నిబంధనల ప్రకారమే జరిగితే ఇంకా సీనియర్‌ అధికారులు చాలా మంది ఉన్నారు. దీని వెనుక మర్మం ఏంటో తేలాల్సి ఉంది.




జిల్లా పరిషత్‌ కార్యాలయం



అకౌంట్‌ ఆఫీసర్‌ ప్రత్యేక గది

సిఇఒ సెలవుపై వెళ్లారా.. బలవంతంగా పెట్టించారా?

జిల్లా పరిషత్‌ సిఇఒగా ఉన్న సుబ్బారావు కొద్దిరోజుల క్రితం సెలవుపై వెళ్లారు. వ్యక్తిగత సెలవుపై వెళ్లారని చెబుతున్నప్పటికీ వాస్తవం మాత్రం వేరే ఉందన్న చర్చ సాగుతోంది. నిబంధలనకు విరుద్ధంగా ఫైల్స్‌పై సంతకాలు పెట్టలేక సిఇఒ సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది. నాయకుల ఒత్తిడి తీవ్రతరం కావడంతో ఆయన సెలవు పెట్టినట్లు సమాచారం. ఆయన మళ్లీ తిరిగి విధుల్లో చేరే అవకాశం దాదాపుగా లేనట్లేనని చర్చ నడుస్తోంది. ఆయన వెళ్లిన వెంటనే అకౌంట్‌ ఆఫీసర్‌ పోస్టు ఏర్పాటు చకచకా జరిగిపోయినట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్‌ పాలకవర్గం పదవీకాలం ఇంకా దాదాపు ఏడాదిన్నర మాత్రమే ఉంది. దీంతో నాయకులు సంపాదించుకోవడమే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అందులో భాగంగానే జెడ్‌పిలో అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నట్లు చర్చ నడుస్తోంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో జిల్లా పరిషత్‌ పరిధిలో రూ.కోట్ల విలువ చేసే పనులు జరగనున్నాయి. తాము అనుకున్నట్లు ఆర్థిక లావాదేవీలు సాఫీగా జరిగేవిధంగా నాయకులు అన్ని ఏర్పాట్లూ చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో నిబంధనలను బేఖాతరు చేస్తూ ముందుకు సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. గతంలో జెడ్‌పి సిఇఒగా ఉన్న అధికారి ఇష్టానుసారంగా వ్యవహరించారంటూ వివాదాలు కొనసాగాయి. అప్పట్లో ఆయన్ని ఉన్నతాధికారులు పక్కకు తప్పించడం జరిగింది. ఇప్పుడు మళ్లీ అదే తరహా వ్యవహారాలు సాగిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నరికేసిన భారీ వృక్షాలు

సెలవు రోజు.. ఏళ్లనాటి చెట్లు నరికివేత

ఆదివారం సెలవు రోజున జిల్లా పరిషత్‌ ఆవరణలో ఉన్న ఏళ్లనాటి చెట్టును కొంతమంది వ్యక్తులు నరకడం హాట్‌టాపిక్‌గా మారింది. రాజకీయ నాయకుల కనుసన్నల్లో ఇదంతా జరిగిందన్న చర్చ సాగుతోంది. కొంతమంది చెట్లు నరికివేతను అడ్డుకుని ఆందోళన చేయడంతోపాటు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా పరిషత్‌ అధికారులు మాత్రం తమకు తెలీదని సమాధానం చెప్పడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం చెట్లు నరికివేస్తారన్న ప్రచారం శనివారమే సాగింది. అన్నట్టుగానే ఆదివారం నరకడం ప్రారంభించారు. ఏళ్లనాటి చెట్టుకు సంబంధించి పెద్దకొమ్మ నరికేసమయానికి అడ్డుకోవడంతో, చెట్టు పూర్తిగా నరకకుండా అడ్డుకున్న పరిస్థితి నెలకొంది. చెట్లు నరికివేత నుంచి జిల్లా పరిషత్‌ జరుగుతున్న పరిణామాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు జిల్లా పరిషత్‌లో జరుగుతున్న పరిణామాలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

ఆక్రమణలపై కఠిన చర్యలు..!



నూరుశాతం పన్ను వసూళ్లే లక్ష్యం

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

పిజిఆర్‌ఎస్‌ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

డిపిఒ కె.అనూరాధ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



పంచాయతీల స్థలాల ఆక్రమణపై సర్వేచేసి కఠిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు గట్టి ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధ తెలిపారు. ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో డిపిఒ పలు అంశాలపై మాట్లాడారు. మార్చి నెలాఖరుకు నూరుశాతం పన్ను వసూలు లక్ష్యమని, పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పిజిఆర్‌ఎస్‌ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఆర్థిక సంఘం నిధులు వినియోగం, నెలాఖరులోపు సిబ్బందికి ప్రమోషన్ల ప్రక్రియ పూర్తిచేయడం, వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు, ఆడిట్‌ నివేదికలు వంటి పలు అంశాలపై డిపిఒ వివరించారు.

ప్రశ్న : గ్రామ పంచాయతీల స్థలాలు పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురవుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఏమైనా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారా?

డిపిఒ: పంచాయతీ స్థలాల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. పంచాయతీ స్థలాలపై ప్రత్యేకంగా సర్వే నిర్వహిస్తున్నాం. స్థలాలు ఆక్రమణకు గురైతే నోటీసులు ఇవ్వడంతో పాటు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : పారిశుధ్యంపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిపిఒ: పారిశుధ్యంపై ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నాం. క్లాప్‌ మిత్రల రిక్షాలను వారానికి మూడు సార్లు ప్రతి ప్రాంతాన్నీ సందర్శించాలని నిర్ణయించడం జరిగింది. మైక్‌, బ్యానర్లతో ప్రచారం చేసి తడి, పొడి చెత్తను వేరుగా ఇచ్చే విధంగా ప్రజలకు అవగాహన కల్పించే ప్రక్రియ సాగుతోంది. చెత్తను బిన్‌, బ్యాగ్‌ల్లో పెట్టాలని చెబుతున్నాం. చెత్త కుప్ప అనేది కనిపించకూడదని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

ప్రశ్న : 15వ ఆర్థిక సంఘం నిధులు ఏ పనులకు ఖర్చుపెడతారు?

డిపిఒ : ఆర్థిక సంఘం నిధులు తాగునీరు, పారిశుధ్యం వంటి ఇతర అవసరాలకు ఖర్చు పెట్టడం జరుగుతోంది.

ప్రశ్న : వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ఏవిధమైన చర్యలు తీసుకుంటున్నారు?

డిపిఒ : తాగునీటి చెరువులు పూర్తిగా నింపాలని ఆదేశాలు ఇచ్చాం. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే ముందుగానే గుర్తించి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుంటారు.

ప్రశ్న : ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుతోంది. పన్నుల వసూలు ఏవిధంగా జరుగుతోంది?

డిపిఒ : ఇప్పటి వరకూ 73 శాతం పన్నుల వసూలు జరిగాయి. ఈ నెలాఖరుకు నూరుశాతం వసూలు చేసేవిధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. పన్ను వసూళ్లకు బిల్లు కలెక్టర్లు లేనిచోట సచివాలయ సిబ్బందిని టీంలుగా ఏర్పాటు చేసి పన్నులు వసూలు చేయడం జరుగుతోంది.

ప్రశ్న : పంచాయతీ సిబ్బందికి ప్రమోషన్ల ప్రక్రియ ఏమైనా జరుగుతోందా?

డిపిఒ : ఈ నెలాఖరులోపు సిబ్బందికి సంబంధించి ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేసేవిధంగా ప్రక్రియ కొనసాగుతోంది.

ప్రశ్న: పిజిఆర్‌ఎస్‌ ఫిర్యాదుల పరిష్కారం ఏవిధంగా ఉంది?

డిపిఒ : మొత్తం 107 పిజిఆర్‌ఎస్‌ ఫిర్యాదులు వచ్చాయి. 79 ఫిర్యాదులను పరిష్కరించాం. రెండు ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. 24 ఫిర్యాదులు రీ ఓపెన్‌ అయ్యాయి.

ప్రశ్న : ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలు ఎన్ని ఉన్నాయి? నిర్వహణ ఎలా ఉంది?

డిపిఒ : చెత్త నుంచి సంపద తయారీపై ప్రత్యేక దృష్టి పెట్టాం. జిల్లాలో మొత్తం 547 పంచాయతీలు ఉన్నాయి. 533 పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా ముందుకు సాగుతున్నాం. ప్రస్తుతం 317 పూర్తిగా పనిచేస్తున్నాయి. 206 పాక్షికంగా పనిచేస్తుండగా 11 ఇంకా పనిచేయడం లేదు.

ప్రశ్న : పంచాయతీల్లో ఆడిట్‌ సమస్యలు మీ దృష్టికి వస్తున్నాయా?

డిపిఒ: ఆడిట్స్‌ నివేదికలు ఇక్కడికిరావు. పంచాయతీల పరిశీలనకు వెళ్లినప్పుడు ఆడిట్‌ అబ్జెక్షన్స్‌ను పరిశీలించడం జరుగుతోంది.

గిరిజన గ్రామాల్లో రహదారులు నిర్మించాలి

ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి



జీలుగుమిల్లి: ప్రజా చైతన్య యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న రవి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లోని అన్ని గిరిజన గ్రామాలకూ రహదారులు నిర్మించాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం మండలంలో స్థానిక సమస్యలపై చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను ఆయన ప్రారంభించారు. మొదటిరోజు యాత్ర మండలంలోని జీలుగుమిల్లి, రమణక్కపేట, వంకవారిగూడెం మీదుగా కామయ్యపాలెం చుట్టూ పక్కల గిరిజన గ్రామాలను కలుపుతూ రాచన్నగూడెం, జగన్నాథపురం గ్రామాల మీదుగా అంకన్నగూడెం, దిబ్బగూడెం గ్రామాలతోపాటు తెల్లవరం నిర్వాసిత కాలనీ వరకూ సాగింది. ఈ యాత్రలో భాగంగా ఆయా గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలపై పలువురు గిరిజనుల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వంకవారిగూడెం, జీలుగుమిల్లి రహదారి మధ్యలో వంతెన నిర్మాణం చేపట్టాలని, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్‌ చేశారు. మారుమూల ఏజెన్సీ గ్రామాలకు రహదారులు నిర్మించాలని, గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా తెల్లవరం నిర్వాసిత కాలనీలో పర్యటించగా కాలనీలో సమస్యలతో సతమతమవుతున్నామని యాత్ర దృష్టికి తీసుకురాగా కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, మండల కమిటీ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య, కారం నాగదుర్గ, గుడెల్లి.వెంకట్రావు, రాజమండ్రి దానియేలు, తెల్లం సంకురుడు. గంగులు, మల్లు దొర తదితరులు పాల్గొన్నారు.

పోలవరం : కూటమి ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌ సిక్స్‌ పథకాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ విమర్శించారు. సిపిఎం ఆధ్వర్యంలో మార్చి 17 నుంచి 25వ తేదీ వరకూ బుట్టాయగూడెం, పోలవరం మండల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఆదివారం పోలవరం చేరింది. స్థానిక అంబేద్కర్‌ విగ్రహం బస్టాండ్‌ సెంటర్‌ వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడి అమలు కానీ హామీలు ఇచ్చారన్నారు. జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలని, ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్‌ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల హామీలను గాలికి వదిలారని విమర్శించారు. విద్యుత్‌ ఛార్జీలు పెంచి స్మార్ట్‌ మీటర్లు బిగిస్తూ సామాన్యులపై భారాలు మోపడం దారుణమన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విభజన హామీలు అమలు చేయడంలో బిజెపి రాష్ట్రానికి ద్రోహం చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే దిశగా పాటుపడాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమాలే జవాబు ఇస్తాయని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల సాగులో ఉన్న ఎల్‌టిఆర్‌ 1/70 చట్టం అగర్వాల్‌ పట్టాలివ్వాలని డిమాండ్‌ చేశారు. పోడు భూములను సాగు చేస్తున్న వారందరికీ అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం పట్టాలివ్వాలన్నారు. 2013 భూసేకరణ చట్టప్రకారం పోలవరం నిర్వాసితులందరికీ న్యాయమైన పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు. పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని తెలిపారు. పోలవరం మండల కార్యదర్శి కారం భాస్కర్‌ మాట్లాడుతూ పోలవరం కేంద్రంలో 30 పడకల హాస్పటల్‌ను త్వరితగతిన పూర్తి చేసి మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. గిరిజన సాగులో ఉన్న ఎల్‌టిఆర్‌ 1/70 భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. పోలవరంలో శ్మశానవాటిక నిర్మించాలన్నారు. ఈ యాత్రలో సిపిఎం మండల నాయకులు బొరగం భూ చంద్రరావు, పోలోజు నాగేశ్వరరావు, చుండ్రు బుల్లెమ్మ, ఎస్‌.సాయికృష్ణ, గోకూరి పాండవులు, కె.భీమరాజు, అనూష, రాజు పాల్గొన్నారు.



పోలవరంలో..

కొయ్యలగూడెం : సిపిఎం ప్రజా చైతన్య యాత్ర ఆదివారం కొయ్యలగూడెంలో ఎస్‌టి యానాదిపేటలో ప్రారంభమైంది. ఇళ్ల స్థలాలు, రోడ్లు, అధిక ధరలు, విద్యుత్‌ ఛార్జీలు, డ్రెయినేజీ సమస్యలను సిపిఎం జిల్లా సెక్రటేరియట్‌ సభ్యురాలు మొడియం నాగమణి దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. ఈ నెల 25న మంగళవారం సమస్యలపై తహశీల్దార్‌ కార్యాలయం వద్ద సమస్యలపై వినతిపత్రాలు ఇవ్వాలని, సమస్యలతో బాధపడుతున్న ప్రజానీకం అంతా తరలిరావాలని సిపిఎం పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌.శివకుమార్‌ మర్రి సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం నగర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్‌

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్‌

ఏలూరు నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26వ తేదీ మున్సిపల్‌ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిపిఎం నగర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్‌ విజ్ఞప్తి చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం పడమర వీధి ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాదయాత్ర బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా డిఎన్‌విడి.ప్రసాద్‌ మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలైనా నేటికీ వారు చేసిన వాగ్దానాలు అమలు చేసే ప్రయత్నం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు యుద్ధ ప్రాతిపదికన ఇస్తామని వాగ్దానం చేసిన చంద్రబాబు వాటి ఊసెత్తకపోవడం అన్యాయమన్నారు. తక్షణం టిడ్కో లబ్ధిదారులందరికీ ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి కేటాయించాలని డిమాండ్‌ చేశారు. సూపర్‌ సిక్స్‌ పథకాలు తక్షణం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరు నగరంలో అనేక ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. వేసకాలం కావడంతో తాగునీరు సరిగ్గా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని. జిల్లా కేంద్రంలోనే ఈ దుస్థితి ఉండడం దారుణమని అన్నారు. ప్రభుత్వం విద్యుత్‌ ఛార్జీలు పెంచడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత కలిగిన వారికి వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ పాదయాత్ర బృందంలో సిపిఎం నాయకులు వైఎస్‌.కనకారావు, వివిఎన్‌.పసాద్‌, పి.దిశేషు, కె.విజయలక్ష్మి, దుర్యోధన, బి.సోమయ్య, జి.శివకుమార్‌, జె.గోపి, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రజా చైతన్య యాత్రలో మాట్లాడుతున్న డిఎన్‌విడి.ప్రసాద్‌

భగత్‌సింగ్‌ ఆశయాలు అనుసరణీయం

వర్ధంతి కార్యక్రమాల్లో ప్రముఖులు

భగత్‌సింగ్‌ ఆశయాలు అనుసరణీయమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళి అని పలువురు అన్నారు. ఆదివారం భగత్‌సింగ్‌ వర్ధంతి కార్యక్రమాలను జిల్లాలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి - నూజివీడు టౌన్‌

పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో భగత్‌ సింగ్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జి.రాజు, ఎంఆర్‌.హనుమాన్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పద్మాంజలి, కేశవరావు, వసంతరావు, స్కూల్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్‌ : దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన భగత్‌ సింగ్‌, రాజ్‌ గురు, సుఖ్‌ దేవ్‌లకు డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఆదివారం స్థానిక సుందరయ్య కాలనీలో భగత్‌ సింగ్‌, రాజ్‌ గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు డివైఎఫ్‌ఐ మాజీ నాయకులు పి.ఆదిశేషు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్‌ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వైఎస్‌.కనకారావు, వివిఎన్‌.ప్రసాద్‌, జె.గోపీ, బి.సోమయ్య, చల్ల పైడియ్య, ఆర్‌.నరసింహమూర్తి, సత్తిరాజు, నాగమణి, అపాయమ్మ, సత్యనారాయణ, ప్రశాంత్‌, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం :పట్టణంలోని భగత్‌ సింగ్‌ సెంటర్‌లో స్వతంత్ర పోరాట యోధులు భగత్‌ సింగ్‌, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోపీ అధ్యక్షత అధ్యక్షత వహించగా డివైఎఫ్‌ఐ జిల్లా పూర్వ నాయకులు పసల సూర్యారావు భగత్‌ సింగ్‌ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్‌ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ మాజీ నాయకులు ఎం.జీవరత్నం, వంగ గోపీ, పిల్లి పోతురాజు, వెంకట సుబ్బారావు, వీర్రాజు, కె.సుబ్బారావు, బి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : ముసునూరు గుడిసెల సెంటర్‌ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్‌ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల వెంకన్న,పేరిచర్ల మంగమ్మ, పేరిచర్ల శివకుమారి, జూటూరు జమలయ్య, జూటూరు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు అనుమోలు మురళి పలువురు నాయకులతో కలిసి భగత్‌ సింగ్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బరగడ కుమారి, శిరీష, మంగ బూదెమ్మ పాల్గొన్నారు.

నిడమర్రు : మండలంలోని భువనపల్లి, అడవికొలను గ్రామాల్లో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు భగత్‌ సింగ్‌ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహనం, లావేటి సోంబాబు, కమిలి నాని, పిల్లా బ్రహ్మం, గుండమ్మ రాము, కురిటి అప్పారావు, సింగంపల్లి సత్యనారాయణ, కలిసెట్టి నరసింహారావు, గొలగన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో...



జీలుగుమిల్లిలో

జీలుగుమిల్లి : డివైఎఫ్‌ఐ యువజన సంఘం పూర్వ జిల్లా అధ్యక్షులు ఎ.రవి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో భగత్‌ సింగ్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో ప్రధానాచార్యులు జనార్ధన్‌ ఆధ్వర్యంలో భగత్‌ సింగ్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన విద్యార్థి భగత్‌ సింగ్‌ చిత్రపటాన్ని బ్లాక్‌ బోర్డుపై గీసిన విధానం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నాయకులు తెల్లం దుర్గారావు, వెంకట్రావు, సీతారామయ్య, ఆర్‌.దానియేలు, కె.దుర్గ, జనార్ధన్‌, గంగులు తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలులోని బాలుర ప్రత్యేక వసతి గృహంలో నిర్వాహకులు గురుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్‌.లింగరాజు హాజరయ్యారు. వసతి గృహ నిర్వాహకులతో పాటు లింగరాజు, భగత్‌సింగ్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా భగత్‌ సింగ్‌ జీవిత విశేషాలు ఇతర అంశాల గురించి విద్యార్థులకు లింగరాజు వివరించారు.

ఆగిరిపల్లి : భగత్‌ సింగ్‌, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఆగిరిపల్లి సిపిఎం కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్‌ సింగ్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టౌన్‌ కార్యదర్శి షేక్‌ జహాంగీర్‌ భాషా, వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు, సభ్యులు నైనవరపు ఊళక్కయ్య, షేక్‌ ఛాన్‌భాషా, సంగా శ్రీనివాసరావు, చింతకాయల రాంబాబు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి

దళిత సంఘం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసి అవమానపరిచిన వ్యక్తులను వెంటనే శిక్షించాలని కోరుతూ ఆదివారం జీలుగుమిల్లి జాతీయ రహదారిపై ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేకం చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేయడం హేయమైన చర్య అని ఇటువంటి దు:శ్చర్యకు పాల్పడిన వారిని దేశ ద్రోహులుగా గుర్తించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు ఎం.ప్రభాకర్, సిహెచ్.అరుణ్, రవితేజ, దేవ లక్ష్మణ్, మనోజ్, జాన్ మోషే, నరసింహ, సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగులకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చింతలపూడి

క్రికెట్ బెట్టింగ్ అనేది ఒక జూదమని, క్రికెట్ మ్యాచ్‌ల ఫలితాలపై డబ్బులు పెట్టడం చట్టవిరుద్ధం, ప్రమాదకరమని చింతలపూడి ఎస్ఐ కుటుంబారావు అన్నారు. ఆర్థికంగా చితికిపోయేలా చేస్తుందని, బెట్టింగ్‌కు బానిసయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. ఇది మానసికంగా, శారీరకంగా హాని చేస్తుందన్నారు. బెట్టింగ్ వల్ల నేరాలు పెరిగే అవకాశం ఉందన్నారు. బెట్టింగ్ వల్ల కుటుంబంలో గొడవలు, విడాకులు జరిగే అవకాశం ఉందన్నారు. క్రికెట్ మ్యాచ్‌లను కేవలం వినోదం కోసం చూడాలని, బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని, బెట్టింగ్ గురించి ఎవరైనా మాట్లాడితే వారిని ప్రోత్సహించవద్దని తెలిపారు. మీరు బెట్టింగ్‌లకు బానిసయ్యారని అనుమానం వస్తే వెంటనే నిపుణుల సహాయం తీసుకోవాలన్నారు. బెట్టింగ్‌లో పాల్గొంటే జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ అనేది ఒక ప్రమాదకరమైన జూదమని, దీనికి దూరంగా ఉండటం మంచిదని తెలిపారు.

నేడు మున్సిపాల్టీలో బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి తెలిపారు. నూజివీడులో ఆయన ఆదివారం మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గా అధ్యక్షతన సమావేశాలు జరుగుతాయన్నారు. సాయంత్రం మూడు గంటలకు సాధారణ సమావేశం నిర్వహిస్తామన్నారు. కౌన్సిల్ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

మేఘలాదేవిని కలిసిన రత్నమణి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవిని కొయ్యలగూడెంలో ఆమె నివాసం వద్ద డిప్యూటీ కలెక్టర్ రత్నమణి ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గతంలో కొయ్యలగూడెం తహశీల్దార్ కార్యాలయంలో రత్నమణి ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. టిడిపిలో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గం చూపిస్తున్న మేఘలాదేవిపై ఉన్న అభిమానంతో ఆమెను కలుసుకోవడానికి వచ్చినట్లు చెప్పారు. విధి నిర్వహణలో అంచెలంచెలుగా ప్రమోషన్లు తీసుకుంటూ ప్రస్తుతం కాకినాడ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు రత్నమణి తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మెగా కుటుంబం సేవాగుణం కలిగిన కుటుంబమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. చిరంజీవి తనయుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు రక్తదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ నెల 27వ తేదీన రామ్‌చరణ్ పుట్టినరోజును పురస్కరించుకుని మెగా అభిమానులు, ఏలూరు ప్రభుత్వాసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని ఎంఎల్‌ఎ బడేటి చంటి ప్రారంభించారు. తొలుత రామ్‌చరణ్ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేసిన మెగా అభిమానులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో మెగా అభిమానులు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు, టిడిపి నాయకులు కొట్టు మనోజ్, మారం అను, రాజేష్, జనసేన నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీనరేష్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు ఎస్సీ బాలికల వసతి గృహం నుంచి నారాయణపురం వరకు 1495 మీటర్ల పొడవున రూ.1.06 కోట్ల అంచనా వ్యయంతో ఉపాధి హామీ చట్టం నిధులతో నిర్మించనున్న సీసీ, బిటి రోడ్డుకు ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలోని వారు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చేందుకు, రైతులు ధాన్యాన్ని మార్కెటింగ్ చేసుకునేందుకు ఈ దారి ఎంతగానో దోహదపడుతుందన్నారు. నారాయణపురం నుంచి బల్లిపాడు (సిపాయి పేట) మెట్ట రోడ్డును తారు రోడ్డుగా నిర్మిస్తున్నారు. రైతులకు, గ్రామస్తులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు, ఉంగుటూరు, నారాయణపురం సర్పంచులు బండారు సింధు, దిద్ద అలకనంద, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, పార్టీ ఏలూరు ఇన్‌ఛార్జ్ అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సిపిఐ శత వార్షికోత్సవాల సందర్భంగా సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రచార జాతాను సిపిఐ జిల్లా కార్యాలయం వద్ద అక్కినేని వనజ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కినేని వనజ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నేటి నుండి భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు జిల్లాలో సభలు, సమావేశాల ద్వారా ప్రచారం నిర్వహించి ముగింపు సమావేశం ఏప్రిల్ 14న జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తామని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

జెడ్‌పిలో వృక్షం తొలగింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

దశాబ్దాల పురాతనమైన వృక్షాన్ని అనుమతులు లేకుండా ఒక వ్యక్తి తొలగించాడని జెడ్‌పి రెవెన్యూ ఆఫీసర్ రామకృష్ణ మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా హరికృష్ణ పని చేస్తున్నారు. ఆదివారం ఉదయం కూచిపూడి గ్రామానికి చెందిన బుద్ధవరపు రాజు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉన్న అతి పురాతన చెట్టును మనుషులను పెట్టి నరికించి వేశాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారి వచ్చి చూసేసరికే చెట్టు నేలమట్టమైంది. దీంతో ఆయన మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

టి.నరసాపురం :కలుపు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రాజుపోతేపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజు పోలేపల్లి గ్రామానికి చెందిన తాడేపల్లి వేణు (45)కు 25 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఇటీవల వేణు విపరీతంగా మద్యం తాగి భార్యను అనుమానంతో కొడుతున్నాడు. సదరు విషయం గ్రామ పెద్దలకు చెప్పి పుట్టింటికి వెళ్లిపోతానని చెప్పడంతో తన భార్య తనను వదలి వెళ్లి పోతుందోనని క్షణికావేశంతో ఈ నెల తొమ్మిదో తేదీన కలుపు మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 22వ తేదీన మృతి చెందాడు. మృతుని భార్య భుజ్జమ్మ ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూపు!

కష్టపడినవారికి కేటాయించాలని
కోరుతున్న కార్యకర్తలు
ఏదో పదవి వస్తే చాలన్నట్లు
సీనియర్ నాయకులు
అందరికీ న్యాయం చేయడం
కత్తిమీద సామే

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో నామినేటెడ్ పదవుల భర్తీ ఎప్పుడని కూటమి నాయకులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. పార్టీ కోసం కష్టపడినవారికి కేటాయించాలని కార్యకర్తలు కోరుతున్నారు. గ్రూపులు, కుల, మత బేధాలు లేకుండా నామినేటెడ్ పదవులు ఇవ్వాలంటున్నారు. నామినేటెడ్, మండలం, పట్టణ పదవులతో పాటు సొసైటీ చైర్మన్, ఎఎంసి చైర్మన్, బోర్డు సభ్యుల పదవులు త్వరగా పూర్తి చేయాలని కార్యకర్తలు కోరుతున్నారు. మూడు పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో నేతలు నామినేటెడ్ పదవుల కోసం పోటీ పడుతున్నారు. ఇప్పటికే ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఒక ఫార్ములా ప్రకారం పదవులను ఖరారు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది.

అటు ప్రభుత్వంలో ఇటు పార్టీలో పదవుల భర్తీ ఆలస్యం అవుతుండటంతో పార్టీలోని నేతలు పూర్తి నిరాశ, నిస్పృహలో ఉన్నారన్న టాక్ వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే ముందే నామినేటెడ్ పోస్టుల భర్తీని పూర్తి చేయాలని నేతలు కోరుతున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో నాయకత్వం ఏం చేయబోతుందనేది ఆసక్తికరంగా మారింది. పార్టీ పెద్దలు తీసుకున్న నిర్ణయం వల్ల కష్టపడిన వారికి, కార్యకర్తలకు అన్యాయం జరిగితే ఆ నిర్ణయానికి కట్టుబడి ముందుకు సాగుతారా లేదా అసంతృప్తి వ్యక్తం చేస్తారా అని చూడాలి. పార్టీ పరంగా భర్తీ ప్రక్రియ ఆలస్యమవుతున్నప్పటికీ పదవులు ఆశిస్తున్న నేతలు మాత్రం వెనక్కి తగ్గటం లేదు. ఎవరికి వారుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కింది స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మండలం పదవులు, ఇతర నామినేడ్ పదవులకు పావులు కదుపుతున్నారు. ప్రస్తుతం ఆశల పల్లకిలో ఉన్న నేతల్లో ఎంత మందిని అదృష్టం వరిస్తుందో చూడాలి.



గత 30 నుంచి 40 సంవత్సరాలుగా టిడిపి కోసం పనిచేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు చాలామంది ఏదో పదవి వస్తే చాలు అనే ఆశతో ఉన్నారు. కాని ఇప్పుడున్న పరిస్థితుల్లో టిడిపి సీనియర్ కార్యకర్తలకు, నాయకులందరికీ న్యాయం చేయడం కత్తి మీద సాములగా పరిస్థితి తయారైంది. ప్రస్తుతం ఉన్న మండల, పట్టణ, నామినేటెడ్ పదవులు కూడా జనసేన, బిజెపిలకు కూడా న్యాయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. జనసేన పార్టీకి వారు ఆశించిన పదవులు రాకపోతే వారి నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. నాయకులు సూచనలతో పాటు, కార్యకర్తల సూచనలు కూడా తీసుకొని, పదవులు భర్తీ చేయాలని కార్యకర్తలు కోరుతున్నారు.

యువత భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలి

ప్రజాశక్తి - పోలవరం

నవ యువ సమాఖ్య ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు 94వ వర్ధంతి వేడుకలు మండలంలోని రెడ్డి నాగంపాలెం గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల నాయకులు చదల శివ, మీడియం శ్రీను అధ్యక్షతన నిర్వహించిన సభలో సుమారు వందమంది విద్యార్థి, యువజనులు పాల్గొని ముందుగా అమరులకు నివాళులర్పించారు. నవ యువ సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.మోహన్, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కె.భాష మాట్లాడారు. అనంతరం దేశంలో పెరుగుతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా మతోన్మాది దిష్టిబొమ్మను విద్యార్థి యువజన నాయకులు గ్రామంలో ప్రదర్శన నిర్వహించి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు కుంజం రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : చిన్న వయసులోనే దేశం కోసం ఉరికొయ్యలను ముద్దాడి ప్రాణాలర్పించిన అమరవీరులు భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లని సిపిఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు అన్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో సిపిఐ కార్యాలయం వద్ద భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్‌ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో షేక్ బాజీ, వెలగల రామారావు, ఎస్.గిరి, మట్టా రామకృష్ణ పాల్గొన్నారు.

కుక్కునూరు : యువత భగత్ సింగ్ అడుగుజాడల్లో నడవాలని సిపిఐ కుక్కునూరు మండల సమితి కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయం సీతారామనగరంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటాచారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కుక్కునూరు మండల కార్యవర్గ సభ్యులు మడిపల్లి రమణయ్య, నాయకులు నకిరికంటి నాగరాజు, దేవా, గంగ, దావీదు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం ఆధ్వర్యంలో స్థానిక దొండపాడులోని నాట్య శిక్షణా కేంద్రంలో విప్లవవీరులు భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య గురువు మేదరమెట్ల శిరీష మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి నాట్య విద్యార్థులు గాయత్రి, వైష్ణవి, దేవకి, భువనేశ్వరి, ప్రణవి, అన్విత, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి :ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సిపిఐ కార్యాలయంలో తుర్లపాటి బాబు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కో-కన్వీనర్ టి.రాజు, యువజన సమైక్య నాయకులు వడ్డే రామా రావు, డోలా రాజేష్, రాజుబోయిన శ్రీను, పిట్టా చందు, బా బు, శివనాగు, తొర్లపాటి అంబేద్కర్, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : టి.నరసాపురం పంచాయతీ పరిధిలోని కృషాపురం గ్రామంలో బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బంజారా భజరంగీ భేరీ సంఘం ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్‌నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జరభల రమేష్, భూక్యా రాములు, భూక్యా కృష్ణ, భూక్యా నాగరాజు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని శింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి దాత ఆదివారం విరాళం అందించారు. కృష్ణా జిల్లా బంటుమిల్లి గ్రామానికి చెందిన యడ్లపల్లి నాగేశ్వరరావు, కమల దంపతులు స్వామివారి నిత్యాన్నదానానికి రూ.50 వేల చెక్కును ఆలయ సహాయ కమిషనరు ఆర్.గంగాశ్రీదేవికి అందించారు.

బాధితుడికి 'మానవత 'ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రమాదంలో గాయాలపాలై అనారోగ్యానికి గురైన బాధితునికి కొయ్యలగూడెం మానవత సంస్థ ఆదివారం ఆర్థిక సహాయం అందించింది. పొంగుటూరు గ్రామానికి చెందిన చేపల సుబ్బారావుకు ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదంలో ఎడమకాలు విరిగిపోయింది. ఆపరేషన్ చేసినప్పటికీ కోలుకోలేక మంచాన్ని పట్టాడు. దీంతో ఇతర ఆరోగ్య సమస్యలకు గురయ్యాడు. విషయం మానవత సంస్థ సభ్యులకు తెలియడంతో బాధితుడి నివాసానికి వెళ్లి రూ.నాలుగు వేలు ఖర్చుల నిమిత్తం అందించారు. సంస్థ తరపున దాతలను సంప్రదించి సహాయపడేందుకు కృషి చేస్తామని బాధితుడికి హామీ ఇచ్చారు. మానవత అధ్యక్షులు మాటూరు సుధీర్, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, నిడదవోలు రామారావు, తిగిరిపల్లి చంటి, బొమ్మ మెహన్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - నిడమర్రు

రూ.1.60 కోట్ల వ్యయంతో మందలపర్రు నుంచి క్రొవ్విడి వరుకు నిర్మిస్తున్న కాలువ గట్టు రోడ్డు నిర్మాణ పనులను ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు ఆదివారం పరిశీలించారు. పంచాయతీరాజ్, ఎలక్ట్రికల్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ధర్మరాజు మాట్లాడుతూ అధికారులను పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి సకాలంలో పనులు పూర్తి చేయాలని అదేశించారు. దీనిలో భాగంగా నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలపై అధికారులను ఆరా తీసి, పలు సూచనలు చేశారు.

డ్వాక్రా మహిళలకు ఉల్లాస్ పరీక్ష

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గ పరిధిలో ఉల్లాస్ పరీక్ష కేంద్రాల్లో 1,067 మందికి ఆదివారం పరీక్ష నిర్వహించినట్లు వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ డిటి సుందరరావు తెలిపారు. చాట్రాయి మండలంలో 19 కేంద్రాల్లో 252 మంది, ఆగిరిపల్లి మండలంలో 27 కేంద్రాల్లో 274 మంది, నూజివీడు మండలంలో 27 కేంద్రాల్లో 271 మంది, ముసునూరు మండలంలో 13 కేంద్రాల్లో 270 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. డ్వాక్రా మహిళల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న డ్వాక్రా మహిళలు పూర్తిస్థాయిలో అక్షరాస్యులుగా ఎదిగేందుకు చక్కని వేదిక ఉల్లాస్ అని తెలిపారు. డ్వాక్రా గ్రూపుల్లోని మహిళలు పరిపూర్ణమైన అక్షరాస్యులుగా ఎదిగి, అనేక అంశాల్లో నైపుణ్యత సాధించడం ద్వారా అంతర్జాతీయ ఖ్యాతి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు వెలుగు ఎపిఎం పచ్చిగళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

భీమడోలు :స్వయం సహాయక సభ్యుల్లో అక్షరాస్యత పట్ల ఆసక్తి పెంచడం, సంఘాల పరంగా వారు రోజువారి కార్యక్రమాలు ఇతరుల సహాయం లేకుండా నేరుగా నిర్వహించుకునేందుకు డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో రూపొందించి అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమం సహకరిస్తుందని వయోజన విద్య జిల్లా సహసంచాలకులు సత్యనారాయణ అన్నారు. ఐకెపి కేంద్రాల ద్వారా ఇప్పటికే అక్షరాస్యులుగా మారిన స్వయం సహాయక సంఘ సభ్యులను మరింత అక్షరాస్యులుగా మార్చేందుకు డిఆర్‌డిఎ ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ మేరకు వారికి అవసరమైన బోధన శిక్షణా తరగతులను దాదాపుగా 40 రోజులు పాటు నిర్వహించారు. వీరి స్థాయిని పరిశీలించేందుకు ఆదివారం మండలంలోని వివిధ పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. వీటిలో అర్హత సాధించిన వారికి త్వరలో సర్టిఫికెట్లను అందించనున్నారు. పరీక్షలు కొనసాగిన తీరును వయోజన విద్య సహసంచాలకులతో పాటు, మండల విద్యాధికారి భాస్కర్ కుమార్ పరిశీలిం చారు. వీరికి భీమడోలు ఎపిఎం వారి సిబ్బంది సహకరిం చారు. పరీక్షలకు 250 మంది హాజరయ్యారని వారు తెలిపారు.

ఆగిరిపల్లి : మండల పరిధిలోని పోతవరప్పాడు ఎంపియుపి స్కూల్‌లో ఉల్లాస్ పరీక్షలు నిర్వహిస్తున్న సెంటర్‌ను డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ విజయరాజు ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలంలో ఉల్లాస్ కార్యక్రమం కింద అక్షరాస్యత శిక్షణ పూర్తి చేసిన 274 మందికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఓఎన్‌డిసి ఆన్‌లైన్ ద్వారా డ్వాక్రా ఉత్పత్తులను తయారు చేసే యూనిట్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం అనిత, ఎపిఎం దయాల రాజశేఖర్, సిసిలు దివ్య, హుసేన్, లక్ష్మీ కంప్యూటర్ ఆపరేటర్ రాంబాబు, అకౌంటెంట్ రజిత పాల్గొన్నారు.

అంబేద్కర్ సాక్షిగా వివాహం

ప్రజాశక్తి - ముదినేపల్లి

సంస్కృతికి భిన్నంగా, అంబేద్కర్ భావాలకు, ఆశయాలకు అనుగుణంగా అంబేద్కర్ చిత్రపటం సాక్షిగా ఇద్దరు యువతీ, యువకులు దంపతులైన సంఘటన ఆదివారం ముదినేపల్లిలో చోటు చేసుకుంది. ముదినేపల్లిలోని రాష్ట్ర మాల మహానాడు కార్యాలయంలో రాష్ట్రమాల మహానాడు అధ్యక్షులు డాక్టర్ సేవా నాగ జగన్ బాబురావు ఆధ్వర్యంలో వివాహం జరిగింది. కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం ముదునూరు గ్రామానికి చెందిన ఇంటేటి సురేంద్రనాథ్, బంటుమిల్లి మండలం జయపురం గ్రామానికి గరికి ముక్కు చంద్రికకు బుద్ధ అంబేద్కర్ ఆలోచన విధానంలో వివాహం జరిగింది. ఈ వివాహం ఇరువురు పెద్దలు అంగీకారంతో జరిగిందని వివాహకర్త బేతాళ సుదర్శన్ (ఆంధ్రప్రదేశ్ బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా) తెలిపారు. పెళ్లికుమారుడు పెళ్లి కుమార్తె ఇద్దరూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అంబేద్కర్ పాదాల సాక్షిగా బుద్ధుని, అంబేద్కర్ చిత్రపటాలు ముందు వివాహం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చీలి లావణ్య, భూపతి అశోక్, గరికి ముక్కు రాజేష్, దాసరి మణి, దాకరపు నాగరాజు, పళ్లెం రాజు, దాకరపు జ్యోజి బాబు, మట్టా సుజాత, తాడంకి వరదానం, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులమని బెదిరింపులు

మహిళా పోలీసుకు ఫోన్‌చేసి వ్యక్తుల వివరాల సేకరణకు యత్నం

పలువురిపై కేసు నమోదు

మోసాలకు పాల్పడుతున్నవారు బజాజ్‌ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లుగా గుర్తింపు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బజాజ్ ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లుగా పని చేస్తున్న వ్యక్తులు పలువురికి ఫోన్ చేసి తాము పోలీసులమని బెదిరింపులకు పాల్పడుతున్న ముఠాపై పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలో బజాజ్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్న సాధారణ ఉద్యోగులు ఏకంగా పోలీసుల పేరును వినియోగిస్తూ పలువురిని బురిడీ కొట్టించారు. చింతలపూడి ప్రాంతంలో మహిళ పోలీసుగా పని చేస్తున్న ఆమెకు గడ్డం శ్రీనివాస్ అనే వ్యక్తి ఫోన్ చేసి తాను ఏలూరు నగరంలో సిఐగా పని చేస్తున్నానని, తన పేరు నాగరాజు అని ఆమెకు తెలిపి ఓ వ్యక్తి పేరును ఆమెకు ఫోన్‌లో చెప్పి అతని వివరాలు, పొటోలు, ఆధార్ కార్డులు, పూర్తి సమాచారాన్ని తనకు పంపించాలన్నాడు. దీంతో ఆమెకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ప్రాంతం నుంచి ఇలా ఫోన్ చేసి ప్రజలను బురిడీ కొట్టించి మోసాలకు పాల్పడుతున్నారని గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదులో భాగంగా బజాజ్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్న గడ్డం శ్రీనివాస్, గడ్డం కిషోర్, మధ్యాహ్నపు వంశీ కృష్ణ, మరో ఇద్దరిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. అంతేకాకుండా ఏలూరు దుగ్గిరాల ప్రాంతానికి చెందిన కలగంటి గోవింద అనే వ్యక్తి బజాజ్ ఫైనాన్స్ లోన్ తీసుకున్నాడు. అతను రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అప్పట్లో కొందరు వ్యక్తులు తాము బజాజ్ ఫైనాన్స్ నుంచి ఫోన్ చేస్తున్నామని, ఇన్సూరెన్స్ సెటిల్‌మెంట్‌కి సంతకాలు పెట్టాలని పెట్టించుకుని వెళ్లారు. అనంతరం ఐదు నెలల తర్వాత మళ్లీ కొందరు వ్యక్తులు అతనికి ఫోన్ చేసి తాము పోలీసులమని తమ డబ్బు తమకు చెల్లించకుంటే ఇంటికి వచ్చి అల్లరి చేస్తామని, ఫొటోలను సోషల్ మీడియాలో పెడతామని బెదిరించారు. దీంతో చేసేదేమీ లేక అతను మూడో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. ఈ రెండు కేసుల్లో సూత్రధారులు తిరుపతికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉండగా బెంగళూరుకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు మూడో పట్టణ పోలీసులు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. మొత్తంగా ఈ రెండు కేసుల్లో తొమ్మిది మందిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్‌జైలు సందర్శన

నూజివీడు టౌన్:పట్టణంలోని సబ్‌జైల్‌ను ఉమ్మడి కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ అరుణ సారిక, సేవాధికార సంస్థ కార్యదర్శి కెవి.కృష్ణయ్య ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైలులోని ఖైదీల అందరి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జైలు నుంచి విడుదలై బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో క్రమశిక్షణ గల జీవితం కొనసాగించాలని సూచించారు. అనంతరం స్టోర్ రూమ్‌ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ, సీనియర్ సివిల్ జడ్జి పెద్ద కాసిం, రెండో అదనపు మ్యాజిస్ట్రేట్ ఎం.శివపార్వతి, సబ్ జైన్ సూపరిండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.